# ప్రేమ పిచ్చి

ప్రవాసాంధ్రుడు వ్రాసిన కథ

దేవరకొండ శ్రీనివాసరావు
**Wappingers Falls N.Y.**

సుబ్బారావు నాకు మంచి స్నేహితుడు. (ఇక్కడ సుబ్బారావనేది జెనెరిక్ తెలుగు పేరనీ, మావాడి ఐడెంటిటి కాపాడ్డం కోసం నేను ఆ పేరు వాడుతున్నాననీ మీరు గమనించాలి.) స్నేహం అంటే మాది అల్లాటప్పా స్నేహం కాదు. అంబాజి పేట ఆముదంలా ఎంత వదుల్చుకుందామని నేను ప్రయత్నించినా వదలని స్నేహం. వెనకటికి బెర్నార్డ్ షా స్నేహితుడు ఒకతను చనిపోతే తెలిసిన ఒక పెద్ద మనిషి పరామర్శిస్తూ **"it must be tough losing a friend like that"** అంటే జవాబుగా బెర్నార్డ్ షా **"Oh trust me, it is almost impossible"** అన్నాట్ట. అలాంటి స్నేహం మాది. దాదాపు నేను ఒకటో తరగతిలో వున్నప్పటి నించి మొన్న మొన్న నాలు గేళ్ళ క్రితం నేను ఈ దేశం వచ్చేదాకా మేమిద్దరం క్లాస్‌మేట్స్‌గా కలిసి చదువుకున్నాం. సుబ్బారావు చాలా తెలివైనవాడు, కష్టపడి చదివేవాడు. క్లాసులో ఎప్పుడూ ఒకటి రెండు రేంకుల్లో వుండేవాడు. పైగా చాలా టేలెంట్ వున్నవాడు కూడా! శాస్త్రీయ సంగీతం నుంచి స్మూల్లో పాలిటిక్స్ దాకా, రిగ్‌వేదం నుంచి రోటరీ క్లబ్ దాకా అన్నింట్లో వాడికి ప్రవేశం వుంది.

అయితే సుబ్బారావుతో ఒక చిన్న చిక్కుం డేది. సుబ్బారావు చాలా సరసుడు. పున్నమి రాత్రి చంద్రుడి దగ్గర నుంచి క్లాసులో అమ్మా యిల దాకా ప్రతీదాంట్లోనూ అందాన్ని ఆస్వా దించేవాడు. ఆ భావంతో ఉబ్బితబ్బిబ్బైనప్పుడల్లా తనకు తెలిసిన సాహిత్యంతో సొంత కవిత్వా లల్లి మాకు వినిపించేవాడు. పైగా ఆ కవిత్వాల్లో ఏ లాటానుప్రాసమో, అంత్యాను ప్రాసమో వాడి ప్రాణాలు తీసేవాడు. ఏదో పువ్వుల్నీ, పక్షుల్నీ చూసి కవిత్వాలు చెప్తే నాకు గొడవుండేది కాదు. వయసులో వుండి, అందంగా వున్న అమ్మాయి కనిపిస్తే చాలు, ముందూ వెనకా చూడకుండా ప్రేమలో పడిపోయేవాడు. అన్నీ తెలిసినవాడవ డంచేత ఏ **Thomas Campion** రాసిన **There is a Garden in Her Face** లేకపోతే **Delight in Disorder**పద్యమో **quote** చేసి తన ప్రేమని సమర్థించుకునేవాడు. అసలు ఒక అమ్మాయిని చూసి, అంత తొందరగా ఆ అమ్మాయిలో తనకి నచ్చిన అంశం ఏమిటి అని అనలైజ్ చేసి, అమెరికన్ జాతీయ గీతం పాడుతున్నట్టు గుండెమీద చేయి పెట్టుకుని ఆ స్పెసిఫిక్ అంశం మీద కవిత్వం ఎలా చెప్పగలిగేవాడో మాకు అర్థమయ్యేది కాదు. కొన్ని సందర్భాలలో



మేము మూడోక్లాసులో ఉండగా, అనుకుంటాను లలితని ప్రేమించానన్నాడు సుబ్బారావు.

ఇది కొంచెం ఇబ్బందిగానే వుండేది. ఇంజనీ రింగ్ చదువుతున్నప్పుడు వర్క్‌షాప్‌లో చెమటోడ్చి పనిచేస్తున్న ఒక అమ్మాయిని చూసి, "ఆహా! ఆ కులుకు చూస్తే నోట పలుకు రావట్లేదు కదా!" అని మావాడు గట్టిగా అంటే ఆ అమ్మాయి బిత్తరపోయిందనడంలో సందేహం లేదు. అమ్మా యిల పలువరస దగ్గరనించి వాళ్ళు కాజువల్‌గా కప్పుకున్న 'షాల్' దాకా ప్రతి విషయం మావాడికి కవితా యోగ్యంగా కనపడేది.

ఏదో కుర్రతనం ఇలా చేశాడనుకుంటే నేను పెద్దగా పట్టించుకునేవాడిని కాదు. కాని సుబ్బా రావు పిన్న వయసులోనే మెచ్యూర్ అయిపోయాడు. మేము మూడో క్లాసులో వుండగా అనుకుం టాను, ఒకనాడు నా దగ్గరకొచ్చి మా క్లాస్‌మేట్ లలితని ప్రేమించానన్నాడు. ఏమంటున్నాడో అర్థం కాక నేను వెర్రిగా తలూపేశాననుకోండి. కానీ రెడు నెలలు తిరక్కుండానే మళ్ళీ నా దగ్గరికి వచ్చి "మనిషికి మనసే తీరని శిక్ష– దేముడిలా తీర్పుకు న్నాడు కక్ష" అని విషాదంగా పాట పాడుతుంటే నాకేమనాలో తోచలేదు. మామిడిపళ్ళు తినడమే తప్ప మననేది ఒకటుంటుందని అప్పట్లో తెలిసింది కాదు. అలా మొదలుపెట్టి, నాలుగో క్లాసులో రాజేశ్వరినీ, అందులో కమలనీ, ఆరులో పద్మనీ, ఏడులో సుజాతనీ, ఎనిమిదిలో శ్రీదేవినీ, తొమ్మి దిలో లక్ష్మినీ, పదిలో రాణినీ, ఇంటర్లో రాధనీ,

సావిత్రినీ, మళ్ళీ శ్రీదేవినీ సుబ్బారావు ఏడాపెడా ప్రేమించేశాడు. ఎవరిని ప్రేమించినా వాళ్ళమీద కవితలు మాత్రం తప్పకుండా అల్లేవాడు. ఉదాహరణకి పద్మతో ప్రేమలో వున్నప్పుడు ఆ అమ్మాయి పాదాలు తీర్చి దిద్దినట్టు వుంటాయని, అసలు అవి "పద్మ పాదాలా, పాదపద్మాలా" అని తనకే అనుమానం వస్తోందంటూ ఒక చిన్న పద్యం చెప్తాడు. అలాగే రాణిని ప్రేమించినపుడు "పారాణి-కాళ్ళ పారాణి" చూడాలని సంబరపడిపోతూ చెప్పిన కవిత్వం నేను వినాల్సొచ్చింది. ఇంజనీరింగ్ చదువుతున్న నాలుగేళ్ళూ కూడా ఇదే పరిస్థితి. అసలు వీటన్నిటికీ కారణం మావాడిది కొంగలాంటి మనస్తత్వం అనీ, 'మోనో మేనియా' వున్నవాడని నా అభిప్రాయం. కానీ జీవితంలో తన ధ్యేయం ఏమిటో నిర్దిష్టంగా తెలిసివుండడంవల్లా, చాలా ప్రాక్టికల్ మనిషి అవడంవల్లా తొందరగానే ఇటువంటి ప్రతీ 'ఇన్‌ఫాట్యుయేషన్' నుంచి తేరుకునేవాడు.

ఇప్పుడు సుబ్బారావు చాలా పెద్ద పొజిషన్‌లో వున్నాడు. పిహెచ్.డి. చేసే రోజుల్లో ఇలాగే ముగ్గురు-నలుగుర్ని ప్రేమించానని నాతో చెప్పేవాడు. జర్మన్ భాష బాగా తెలిసివుండడంచేత ఒక జర్మన్ అమ్మాయిని ప్రేమించావని నాతోచెప్పి చిన్న జర్మన్ పద్యం వినిపించాడు. ముఖ్యమైన విషయమేమిటంటే ఈమధ్యే మావాడు పెళ్ళి చేసుకున్నాడు. పెళ్ళిలో పంతులుగారు అరుంధతీ నక్షత్రం చూపించబోతే, "పక్కనున్న ఈ చక్కని చుక్కకన్నా, ఎక్కడో వున్న రేచుక్క నాకెక్కువా" అని ఓ చెణుకు విసిరేటప్పటికి అతని కొత్త భార్యా, వియ్యాలవారు, ఆ పంతులుగారు అందరూ తలలు పట్టుకు కూర్చున్నారని పెళ్ళికెళ్ళిన ఇంకో మిత్రుడు నాతో చెప్పాడు. సుబ్బారావు ఆదర్శ భర్తలా చక్కగా కాపురం చేసుకుంటాడని నాకే అనుమానం లేదు కానీ, పెళ్ళితో వాడి ప్రేమపిచ్చి వదిలినట్టు నాకు నమ్మకం లేదు. ఇంట్లో అడుగు పెట్టి "హనీ! ఐ ఆమ్ హోమ్... ఈ రోజు మా కాఫెటేరియాలో అమ్మాయిని ప్రేమించేశాను" అని అన్నా అనగలడు సుబ్బారావు. ఇందుకు తార్కాణంగా అప్పుడప్పుడు వాళ్ళ ఇంట్లోంచి గరిటలు, గిన్నెలు వెనకాల ఎగిరి వస్తుంటే సుబ్బారావు పరిగెత్తుకుంటూ కారెక్కి పారిపోతుంటాడని అభిజ్ఞవర్గాల భోగట్టా... ●

## కాలజ్ఞానం

### కళ్యాణం - కరగ్రహణం - 9

### వీక్షణ - నిరీక్షణ

వివాహముతో అతిముఖ్యమైనది శుభముహూర్తం,దీనినే నిరీక్షణము అనికూడా అంటారు. కన్యాదాత ముహూర్తమునకు ముందుగా త్రిలోకములకు అలంకారమైనదిగా, శుభలక్షణములు కలదిగా, అహర్నిశలూ ముత్తయిదువులచే సేవింపబడు దేవేంద్రుని ప్రియభామినియైన "శచీదేవి"ని పళ్ళెములో తెల్లని బియ్యముంచి, వాటిచే, శచీదేవిని పూజించి, తెల్లని వస్త్రము, దీనికే "తెరసాల,""అడ్డతెర" అని పిలుస్తారు. తెల్లని ఆ వస్త్రముమీద "శ్రీ",స్వస్తిక్ " " ముద్రలు వేసి సుగంధ ద్రవ్యములచే, శ్రీస్వస్తిక్‌లు లిఖించి తెరపట్టవలెను. తెరను ఉత్తర దక్షిణములుగా పట్టుకొని, వధూవరులను తూర్పు పశ్చిమ ముఖములుగా కూర్చుండబెట్టి వారిచేతికి బెల్లం జీలకర్ర కలిపి ముద్దగా చేసి యిరువురికి యిచ్చి సుముహూర్త సమయమునకు ప్రతీక్షించుచూ, పురోహితులు "సూర్య సూక్తము"ను పఠించుచుండగా వధూవరులు కుల దేవతలను - ఇష్టదేవతలను - గౌరీదేవిని ధ్యానించుచుండ సుముహూర్త ఘడియల నిరీక్షణానంతరం మంగళవాయిద్యములు మ్రోగుచుండ, వేదమంత్రఘోషతో ముత్తయిదువులు మంగళ గీతికలు పాడుచుండ ఒకరి శిరమున (నెత్తిన) ఒకరు ఇరువురూ నెత్తిన పెట్టుకోవాలి. కుడిచేతితో బెల్లం జీలకర్ర ముద్దనుంచగా, అడ్డతెరతొలగగనే, అప్పటివరకు ప్రతీక్షించువారు వధూవరులు ఒకరి భ్రూమధ్యమును ఒకరు వీక్షించుటయే, నిరీక్షణము లేక శుభముహూర్తము అందురు. అప్పుడు వరుడు యీదిగువ మంత్రము చదవవలెను.

"అభ్రాతృఘ్నీం వరుణ అపతిఘ్నీం బృహస్పతే ఇంద్ర అపుత్రఘ్నీం, లక్ష్మ్యం తామస్యై సవితుస్సువ, అఘోరచక్షుః అపతిఘ్న్యేధి"

'దైవజ్ఞశిరోమణి'

- రాచకొండ కామేశ్వరశర్మ

## పెళ్ళంటే మజాకా కాదు

ఆంధ్రా యూనివర్సిటీకి రెండు పర్యాయాలు వైస్ ఛాన్సలర్‌గా వుండి, తర్వాత మైసూర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పదవి అధిష్టించి తర్వాత ఎన్నో పదవులకి వన్నె చేకూర్చిన శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారు అవివాహితులు.

మీరు పెళ్ళి ఎందుకు చేసుకోలేదని ఎందరో అడిగారు ఆయన్ని. కొందరికి చమత్కారంగా సమాధానం చెప్పారు. కొందరికి కొంటెగా చెప్పారు. మరి కొందరికి వింత వింత కథలల్లి చెప్పారు. అలా ఆయన సన్నిహితుల్లో ఒకరికి ఆయన చెప్పిన కథ. ఇది యదార్థ గాథో, కట్టుకథో ఆయనకే తెలియాలి. రామలింగారెడ్డి గారి మాటల్లోనే-

"ఆంధ్రా యూనివర్సిటీ ప్రక్కనే పిచ్చాసుపత్రి ఒకటి వుంది. మీరు చూశారో లేదో. ఓ మారు ఏం తోచక నేను ఆ ప్రాంగణంలోకి వెళ్ళాను. ఒకతను మంచి విద్యావంతుడిలాగే వున్నాడు. సూటూ బూటూ వేసుకుని నీటుగా తల దువ్వుకుని గార్డెన్‌లో పచార్లు చేస్తూ మధ్య మధ్య చెట్ల మధ్యా గుబురుల మధ్యా దేని కోసమో వెతుకుతున్నాడు. 'ఎవరండీ ఇతను' అని హాస్పిటల్ సూపరింటెండెంట్‌ని అడిగాను. 'ఈయనో పెద్ద ప్రొఫెసరండీ. రీసెర్చిలోపడి ఇంటి గొడవ పట్టించుకోలేదు. భార్య సతీష్ అనే రీసెర్చి స్కాలర్‌తో లేచిపోయింది'.




'అయ్యో పాపం. అప్పటి నుంచి పిచ్చి వాడయ్యాడన్నమాట' అన్నాను. ఇంతలో ఒక గది లోంచి పెద్ద పెద్ద కేకలూ అరుపులూ వినిపించాయి. "అతను కూడా మరో పిచ్చి వాడాండీ!"అనడిగాను. దానికి సూపరింటెండెంట్ "అవును- అతనే ఆ సతీష్' అన్నాడు- చూశారా? ఒక్క స్త్రీ ఇద్దర్ని పిచ్చివాళ్ళని చేసింది. దాంతో హడలిపోయి స్త్రీ ధ్యాసా పెళ్ళి ధ్యాసా పట్టించుకోకుండా ఇలా వుండిపోయాను" అని ముగించారు శ్రీ సి.ఆర్.రెడ్డి.

-పోలాప్రగడ